క్లుప్తంగా

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి హిందీ పరీక్ష లీకేజీపై వరంగల్ కమలాపూర్‌లో ఒక సీఎస్, డీఓల సస్పెన్షన్, ఇన్విజిలేటర్‌ను సర్వీసు నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరీక్ష విషయంలో భద్రతా లోపం కారణమని హైకోర్టు స్పష్టీకరించినందున తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సంబంధం లేని విషయంపై ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం వలన వారి మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు.

'పల్లె పల్లెకు బీజేపీ-ఓబీసీ'



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: పల్లె పల్లెకు బీజేపీ–ఓబీసీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తగూడెం, ప్రకాష్ నగర్, రాంనగర్‌లో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరావు, ఓబీసీ జాతీయ మీడియా సెల్ కో–ఆర్డినేటర్ కేవీ రంగాకిరణ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవి గౌడ్, లక్ష్మణ్ అగర్వాల్, రాయుడు నాగేశ్వర రావు, నరేంద్ర బాబు, చింతలచెర్వు శ్రీనివాస రావు, జల్లారపు శ్రీనివాస్, సువర్ణకంటి మోహన్‌రావు, కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ లైజనింగ్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు ఉత్తర్వులు అందజేస్తున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఎస్సీ లైజనింగ్ ఆఫీసర్‌గా జేకే ఓసీ ఏఈ కె.శ్రీనివాస రావు ఎన్నికయ్యారు. సింగరేణి యాజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వులను ఏరియా జీఎం షాలేమురాజు ఆదివారం అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఆర్ఓఆర్, రోస్టర్ పాయింట్ల వెరిఫికేషన్, అధికారుల పదోన్నతుల కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఏరియా గనుల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాసు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విరాళం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన మోరంపల్లి బంజరకు చెందిన ఆవుల తిరుపాల్‌రెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు రూ.5116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా పునరుత్థాన ప్రార్థనలు

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని క్రైస్తవులంతా మహదానందంతో, భక్తిపారవశ్యంతో ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఏసు సమాధి నుంచి లేచిన రోజు సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు మాట్లాడుతూ.. పాపులను రక్షించేందుకే ఏసు క్రీస్తు మానవునిగా జన్మించి శిలువ వేయబడ్డాడని, అనంతరం సమాధిలో నుంచి లేచి లోకానికి ఓ మార్గాన్ని చూపించారని వివరించారు. ఈ సందర్భంగా... 'మరణమున్ జయించి లేచెన్ మన ప్రభువు నేడు. మహిమ దేహమొనర దాల్చెను. ధర సమాధి బంధములను ధన్యముగను త్రెంచి కొరతలన్ని తీర్చి జీవవరములియ్య వసుధపైని'... అని పాడుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. చర్చిల్లో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఫాదర్లు



టేకులపల్లి: సులానగర్ ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్ ఆగస్టీన్, భక్తులు



పాల్వంచ: బాపూజీ నగర్‌లోని ఎల్‌జీఎం చర్చిలో..



ఇల్లెందు: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



టేకులపల్లి: సులానగర్ ఆర్‌సీఎం చర్చిలో..



పాల్వంచ: రన్ ఫర్ జీసస్ ర్యాలీలో క్రైస్తవులు



ఇల్లెందురూరల్: మామిడిగూడెం చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



పాల్వంచ: చర్చిలో నృత్యం చేస్తున్న చిన్నారులు

నియంత పాలనకు స్వస్తి పలుకుదాం..

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో నియంత పాలనకు చరమగీతం పాడాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఆదివారం పార్టీ శ్రేణులతో పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని, రాష్ట్రాన్ని అనేక రకాలుగా దోచుకుంటున్నారని, విచ్చలవిడిగా బెల్ట్ షాపులను ప్రోత్సాహించడం వలన మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. ప్రజలకు కనీస అవసరాలైన విద్య, వైద్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. జనాభాలో 85 శాతం ఉన్న బహుజనుల హక్కులను, స్వేచ్ఛను అగ్రవర్ణ పాలకులు కాలరాస్తున్నారని ఆరోపించారు. బహుజనుల జీవితాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, సామాజిక మార్పుతో రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలంటే రాజ్యాధికారంతోనే సాధ్యమవుతుందన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానంతో స్థాపించిన బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సాయి, నాగుల రవికుమార్, సిద్ధంకి మల్లేష్, పవన్‌కల్యాణ్, వంగా రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఎస్పీ నాయకులు

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం



గౌతంపూర్ పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం గౌతంపూర్ పంచాయతీకి ఇటీవల జాతీయ స్థాయిలో ఆరోగ్య పంచాయతీ విభాగంలో అవార్డు లభించింది. దీనికి కృషి చేసిన సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ స్రవంతి, వార్డు మెంబర్ భూక్యా హరిత, పంచాయతీ కార్యదర్శి షర్మిల, గ్రామపెద్దలను ఆదివారం పంచాయతీ ఆవరణలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఘనంగా అభినందించారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి సన్మానించారు.

ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ.. అవార్డు రావడానికి ప్రధాన కారణం పచ్చదనం, మురుగు శుద్ధి నిర్వహణ విషయంలో ఎప్పటికప్పుడు పాలకవర్గం పర్యవేక్షించడం, వార్డులలో ఉన్న సమస్యలను ఉద్యోగులతో చర్చించి వాటి నివారణకు సత్వరమే చర్యలు చేపట్టంలో పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకోవటం వలన జాతీయ స్థాయిలో అవార్డు లభించిందన్నారు. ఇటువంటి అవార్డులు మరెన్నో రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బి.రవీందర్, గోపు కుమార్, కరుణాకర్, పొన్నగంటి రాజు, తెలంగాణ క్రాంతి, దొందరబోయిన శ్రీనివాస్, మహేష్, ఇబ్రహీం, అక్బర్, సిక్కి రాహుల్, శ్రీకాంత్, రాజు, శివ, గోపాలకృష్ణ, దిల్‌దార్‌ఖాన్, చిలక రాజయ్య, మొహన్‌రెడ్డి, నర్సింగం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల ధర్నా

కొత్తగూడెంఅర్బన్: విశ్రాంత ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.అజరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జేఏసీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని, విశ్రాంత ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు

ఇల్లెందు: బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యా వ్యాప్తికి పాటు పడిన మహనీయుడు పూలే జయంతి వేడుకలను సింగరేణి యాజమాన్యం అధికారికంగా నిర్వహిస్తుందని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కోటా సాంబయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు లైజన్ ఆఫీసర్‌ను నియమించారని వారి నాయకత్వంలో అధికారికంగా జరుగుతుందని తెలిపారు.

రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేయండి

కొత్తగూడెంరూరల్: రంజాన్ పండగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేసే రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లను వెంటనే పంపిణీ చేయాలని మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా వ్యాప్తంగా 23మండలాల్లో, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో పేద ముస్లింలకు పంపిణీ చేసేందుకు 8వేల గిఫ్ట్ ప్యాకెట్లు వచ్చాయని వీటిని మార్చి 25వ తేదీలోగా పంపిణీ చేయాల్సి ఉండగా నేటికీ అధికారులు పంపిణీ చేయకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. రంజాన్ పర్వదినం సమీపిస్తున్నందున్న ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పంపిణీ చేయాలని కోరారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



మాట్లాడుతున్న పొదెం వీరయ్య

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యను టేకులపల్లిలో కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ మేరకు ఆదివారం ఇల్లెందు నుంచి భద్రాచలం వెళ్తున్న ఆయన టేకులపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో మాట్లాడారు. అనంతరం భద్రాచలం వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా దేవా నాయక్, మండల మహిళా అధ్యక్షురాలు ఆకారపు స్వప్న, రాసమల్ల నర్సయ్య, వీసం శ్రీనివాస్‌రావు, ఇస్లావత్ రెడ్యానాయక్, భూక్యా రవీందర్‌సింగ్, బాణోతు రెడ్డి, ధర్మా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయమూ భగవంతుడి ఆరాధనే



ముస్లింలకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: పేదలకు ఆపన్నహస్తం అందించడం భగవంతుడిని ఆరాధించడంతో సమానమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ మదర్సాలో ముస్లిం మతపెద్దలు సమకూర్చిన నిత్యావసర వస్తువులను ఆదివారం 200 మంది ముస్లిం పేద కుటుంబాలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇస్లాంలో దయకు, దాతృత్వానికి అత్యంత ప్రాముఖ్యత ఉందని.. ముఖ్యంగా రంజాన్ మాసంలో ముస్లింలు తమకు ఉన్న దాంట్లో దానధర్మాలు చేసి సంతృప్తి పొందుతారని తెలిపారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు పండుగలను సంతోషంగా జరుపుకునేలా సీఎం కేసీఆర్ పండుగ కానుకలను అందజేస్తూ.. అధికారికంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, చీమల నాగరత్నమ్మ, జానీ, మెట్టెల కృష్ణ, ప్రమోద్, గాజీ తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న పానిశెట్టి వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: కేంద్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక దమ్మపేట సెంటర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1 – 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు తల్లి లేదా తండ్రి లేని, ఇద్దరూ కోల్పోయి ఇబ్బందులు పడుతున్న పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం ద్వారా నెలకు రూ.4వేల ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా వచ్చే డబ్బులు పిల్లల వైద్య సహాయం కోసం ఉపయోగపడతాయన్నారు. ఆర్థిక పరిస్థితి బాగలేని, బాలకార్మికులుగా మారిన పిల్లలు ఉంటే మీ దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించాలని కోరారు. సమావేశంలో మనుపురి ప్రభాకర్, బత్తుల వెంకటేశ్వర్లు, మాలోతు ప్రశాంత్, మాదారపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మనెంట్ చేయండి..



జెండా ఆవిష్కరిస్తున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయకుండా వేధిస్తోందని ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. ఆదివారం ఇల్లెందు సాహితీ డిగ్రీ కళాశాలలో ఇఫ్టూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు యాకుబ్‌షావలీ ఇఫ్టూ జెండాను ఎగుర వేశారు. గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలం నాటి 44 చట్టాలను రద్దు చేసి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టాలని యత్నిస్తోందన్నారు. కెచ్చెల రంగయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేసీఆర్ ప్రభుత్వ సరైన నిర్ణయాలు తీసుకోలేకపోయిందన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్ట్, మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.రామయ్య, ఆర్.మధుసూదన్‌రెడ్డి, డి.ప్రసాద్, గోనెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



బేతంపూడిలో యూనియన్ మహాసభలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

టేకులపల్లి: గ్రామ పంచాయతీ వర్కర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బేతంపూడి గ్రామంలో ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ టేకులపల్లి మండల ప్రథమ మహాసభ జరిగింది. తొలుత యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాపితంగా 40 వేల మంది కార్మికులు గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్నారని, వారితో వెట్టి చాకిరీ చేయిస్తూ కనీస వేతనం చట్టం అమలు చేయడం లేదని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో వర్కర్ల జీతాలకు తెలంగాణలో వర్కర్ల జీతాలకు చాలా తేడా ఉందన్నారు. గతంలో పంచాయతీల్లో కారోబార్, వాటర్ సప్లై, బిల్ కలెక్టర్ అని వేర్వేరు విభాగాలుగా ఉండే వాటిని రద్దు చేసి మల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి అతి తక్కువ వేతనంతో శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కరోనా సమయంలో ఉత్తమ శ్రామికులుగా గుర్తించి గ్రామ పంచాయతీ వర్కర్లకు అవార్డులు ఇచ్చి, సన్మానాలు చేసి, ఊరేగింపులు చేసిన పాలకులు నేడు వేతనాలు అడిగితే లేనిపోని తప్పులు అంటగడుతున్నారని ఆరోపించారు. మల్టీపర్పస్ విధానం ద్వారా జూనియర్లు, సీనియర్లు అనే తేడా లేకుండా అందరూ చెత్త ఏరివేయాలనడం సరైంది కాదన్నారు. జీఓ నెంబర్ 60, కనీస వేతనం చట్టం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పీఆర్‌సీ కల్పించాలని, కొన్నిచోట్ల వర్కర్లకు ఫొటో విధానం పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. కొన్ని పంచాయతీల్లో వర్కర్లకు కేవలం 5–6 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారని విమర్శించారు. చదువుకుని ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న వర్కర్ల సీనియారిటీని గుర్తించి ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్డ్ అయిన వారికి పెన్షన్, వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వర్కర్లు ఏదైనా ప్రమాదంలో మరణిస్తే రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సరికొండ నాగేశ్వర్‌రావు, సరాటి వెంకటేశ్వర్లు, గొని నాగేశ్వర్‌రావు, రాయండ్ల కోటిలింగం, యశోధ, సమ్మక్క, లక్ష్మి, మాధవి, దుర్గ, విష్ణు, ఎర్రయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

14న చలో భద్రాచలం



మాట్లాడుతున్న సీఆర్‌టీలు

టేకులపల్లి: పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనాలు సాధించిన సందర్భంగా అందుకు కృషి చేసి సహకరించిన వారికి కృతజ్ఞత తెలియజేసేందుకు ఈనెల 14న సీఆర్‌టీల ఆధ్వర్యంలో భద్రాచలంలో కృతజ్ఞత సభ ఏర్పాటు చేసినట్లు సీఆర్‌టీలు తెలిపారు. ఈమేరకు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఆర్‌టీలకు 12 నెలల పెండింగ్ వేతనాలు ఇప్పించడంలో సహకరించిన ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రవిలను ఘనంగా సన్మానించే కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీఆర్‌టీలు అందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గుగులోత్ నరేందర్, భూక్యా లక్ష్మణ్, భూక్యా మంగీలాల్, బాణోతు మంగీలాల్, బి.సునీత, బి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

- గుంతలతో నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



శ్రీనివాస కాలనీ వద్ద పాల్వంచ- ములకపల్లి ప్రధాన రోడ్డు

పాల్వంచ: పాల్వంచ నుంచి ములకలపల్లి మండలానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. దమ్మసెంటర్ నుంచి శ్రీనివాస కాలనీ, కుంటి నాగులగూడెం వరకు అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వాహనాదారులతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. గత వర్షాకాలంలో ఏర్పడ్డ ఈ గుంతలను ఇప్పటి వరకు పూడ్చకపోవడంతో రోజురోజుకు అవి పెద్దగా అవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా ఈ గుంతల వల్ల దుమ్ము ధూళి అధికంగా ఉంటుంది. ముందు వాహనం వెళితే ఆ వెనుక ఉండే వాహనదారులకు ఏమీ కనిపించని పరిస్థితి నెలకొంది. గుంతల్లో పడి పలువురు గాయాల పాలవుతుండగా, వాహనాలు దెబ్బతింటున్నాయని పలువురు వాపోతున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు...

పట్టణ శివారులోని శ్రీనివాస కాలనీ మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. పాల్వంచ నుంచి ములకలపల్లి, దమ్మపేట మీదుగా రాజమండ్రికి ఈ రోడ్డు నుంచే నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇక స్థానికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. నెలల తరబడి ఈరోడ్డు అధ్వానంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాస కాలనీ వరకు రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు గత ఫిబ్రవరిలోనే ప్రారంభం అవుతాయని ఆశించినా ప్రారంభానికి నోచుకోలేదు. అంబేద్కర్ సెంటర్ నుంచి అల్లూరి సెంటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. ఆ పనులు పూర్తయితే దమ్మపేట సెంటర్ రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. ఆ పనులు పూర్తి కాకపోవడంతో ఈ పనులు ఆలస్యం అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఎఈ వంశీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

గుంతలతో నిత్యం ప్రమాదాలు



దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాసకాలనీ వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ గుంతలు రోజురోజుకు పెద్దవిగా మారుతున్నాయి. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

– దేవేందర్, స్థానికుడు

అధికారులు పరిష్కారం చూపాలి



పాల్వంచ నుంచి రాజమండ్రి వరకు వెళ్లాలంటే దమ్మపేట రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. స్థానికులు సైతం నిత్యం తిరుగుతున్న ఈ రోడ్డు అధ్వానంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు పరిష్కారం చూపించాలి.

– పవన్, స్థానికుడు

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు పైనే మట్టి కుప్పలు

మున్సిపాలిటీలోని జయమ్మ కాలనీ నుంచి వనమా కాలనీ వరకు గుట్ట దగ్గర ఉన్న ప్రధాన రోడ్డుపై పలుచోట్ల మట్టి కుప్పలు ఉన్నాయి. మిషన్ భగీరథ కింద పైపులైన్ల కోసం మట్టిని తీసి రోడ్డుపైనే కుప్పలుగా పోసారు. నెలలు గడుస్తున్నా వాటిని లెవల్ చేయడం, తొలగించక పోవడంతో వాహనదారులకు, స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. హమాలీ కాలనీ మూల వద్ద రాళ్ల కుప్పలు సైతం ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మట్టి కుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - పాల్వంచ



ప్రశ్నించాల్సిన అధికారి : సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్
సెల్ నంబర్ : 9849905884